సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 132 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 17.09.2025 | పేజీలు : 4



## రైతు సమస్యల పరిష్కారానికి కృషి

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

4





## సమన్వయంతో పనిచేయాలి

- అధికారులకు అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ సూచన

2 లో

# తుపాకుల శబ్దంలో దద్దరిల్లిన భీమదేవరపల్లి

- అరణ్యాల్లో వెలిసిన గ్రామ రక్షణ దళాలు
- రాయికల్, విరూరూ పీఎస్‌లపై మెరుదాడి
- నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న గ్రామం

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** తెలంగాణ చరిత్రలో ఒక చిన్న మండలం ఎలా ఒక పెద్ద ఉద్యమానికి మూలంగా మారిందో తెలుసుకోవాలంటే భీమదేవరపల్లిని చూడాల్సిందే. చెట్ల నీడలో రహస్యంగా జరిగే సమావేశాలు, అరణ్యాల్లో శిక్షణ పొందుతున్న యువకులు, ఇంట్లో నిల్వచేసిన విత్తనాలను ఇతరులకు అందిస్తున్న రైతులు, ఆహారం వండి పోరాటానికి పంపుతున్న మహిళలు ఇవే భీమదేవరపల్లిలో స్వాతంత్ర్యానికి జ్వాలగా మారిన కథల మూలాలు. ప్రభుత్వానికి ఎదురు నిలిచిన ప్రజల సంకల్పం ఎంత గొప్పదో, ప్రతి ఇంట్లో అది ఎలా ప్రతిఫలించిందో భీమదేవరపల్లి చెబుతోంది. పోలీసులు తరచూ దాడులు చేసినా ప్రజల వెన్నెముక నిటారుగా నిలిచింది. భయం కన్నా ధైర్యమే పెద్దది అన్న నమ్మకంతో గ్రామాలన్నీ ఒక్కటయ్యాయి.

### గ్రామ రక్షణ దళాలు...

అరణ్యాల్లో శిక్షణ పొందిన యువకులు తుపాకులు, దేశీయంగా తయారైన ఆయుధాలతో గ్రామాన్ని కాపాడేందుకు ముందడుగు వేశారు. జమిందార్ల దోపిడీకి ఎదురు నిలిచి రైతులు పోరాటానికి సిద్ధమయ్యారు. ఇంట్లో ఉన్న ధాన్యాన్ని పంచి, ఇతరులకు విత్తనాలు అందించారు.

### రాయికల్ పోలీస్ స్టేషన్‌పై దాడి...

చీకట్లో సమావేశమైన వీరులు, రికార్డులను దహనం చేసి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు ఎంత వేధించినా మోహన్ రెడ్డి వంటి యోధులు తమ స్నేహితుల పేర్లు వెల్లడించకుండా ధైర్యంగా నిలిచారు.

### విరూరు పోలీస్ స్టేషన్‌పై శౌర్య దాడి..

పడాల చంద్రయ్య నాయకత్వంలో యువకులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి, కాల్పుల్లో గాయపడ్డా వెనక్కి తగ్గలేదు. స్వేచ్ఛ కోసం ప్రాణాన్ని పణంగా పెట్టిన వీరి పోరాటం మండలాన్ని కదిలించింది.

### వజ్రపు గుండులో అమరులైన రైతులు..

నిజాం పోలీసులు కాల్పులు జరిపినప్పుడు, ఎడ్ల బండి మీద గాయపడిన యోధులను తరలిస్తున్న రైతు గుండ్ల వీరమల్లు తుపాకిని తీసుకెళ్లి దళానికి అందించాడు. అదే సమయంలో ఎనిమిది మంది రైతులను వరుసగా నిలబెట్టి కాల్చివేశారు. వారి త్యాగం ఉద్యమానికి జ్వాలలైంది. నేటి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ ఆ స్థలాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆనాటి యోధుడు బొజ్జపురి వెంకటయ్య, వజ్రపు గుండును స్మారక స్థూపంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### భీమదేవరపల్లి సందేశం..

తుపాకితో పోరాటం చేసిన చేతులు ఎంత ముఖ్యమో, భోజనం వండి పంపిన చేతులు కూడా అంతే శక్తివంతమైనవి. గ్రామాన్ని కాపాడేందుకు ప్రతి ఇంటిని ఒక పోరాట కేంద్రంగా మార్చిన ప్రజల సంకల్పమే భీమదేవరపల్లిని చరిత్రలో నిలబెట్టింది. ఇది కేవలం ఒక ఉద్యమం కాదు. ఇది ప్రజల ఐక్యతకు, ధైర్యానికి, త్యాగానికి నిదర్శనం.



wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

# అధికారులు సమన్వయంతో పని చేయాలి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్



**జనగామ, మన చౌరాస్తా :** ఈ నెల 17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అన్నారు. ఏర్పాట్ల పై మంగళవారం అదనపు కలెక్టర్ బెన్ష లోమ్ తో కలిసి సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరెట్ లో జరిగే ప్రజా పాలన దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథి గా ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య రానున్నారని తెలిపారు. జెండా ఆవిష్కరణ, గార్డ్ ఆఫ్ ఆనర్ ఏర్పాట్లను డీసీపీ రాజమహేంద్ర నాయక్, వీఐపీ, మీడియా, అధికారులకు ఇబ్బంది కలగకుండా సీటింగ్ గ్యాలరీ ని ఆర్డీఓ గోపిరాంను, శానిటేషన్ నిర్వహణ సరిగ్గా ఉండాలని జనగామ మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు అనంతరం డీసీపీ రాజమహేంద్ర నాయక్ , ఆర్డీవో గోపీరాం, కలెక్టరెట్ ఏవో శ్రీకాంత్, తహసీల్దార్ సంబంధిత అధికారులతో కలెక్టరెట్ లో జరుగుతున్న ఏర్పాట్లను అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు.

## ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభం

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి మంగళవారం భూమి పూజ నిర్వహించారు. 26వ వార్డుకు చెందిన ఎర్రం ప్రసాద్ గుప్తా ఇంటి నిర్మాణాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ పోకల జమున, మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాసు, బీఆర్ఎస్ జనగామ పట్టణ ఉపాధ్యక్షులు బిజ్జాల నవీన్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొని ముగ్గుపోసి ప్రారంభించారు.





## వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేసిన జడ్పీ సీఈవో రవినాయక్

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్లోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను జడ్పి సిఇవో రవి నాయక్ మంగళవారం నాడు ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భముగా వసతి గృహాల్లో వసతులు, స్నానపుగదులు, మరుగుదొడ్ల మెయింటెనెన్స్,స్టాక్ పాయింట్ వివరాలు,ఇతర రికార్డులతో పాటు మెను పాటిస్తున్నారా లేదా అని పరిశీలించారు. వార్డెన్లతో మాట్లాడుతూ విద్యార్థులకు ఇచ్చే ఆహర నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులు స్థానికంగా ఉండాలని సూచించారు.వసతి గృహాల్లో ఇతర మౌళిక సౌకర్యాల ఏర్పాటుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో వీరేశం,వార్డెన్ సుజాత,కార్యదర్శి పూర్ణచందర్ తదితరులు పాల్గొన్నారు.

# మతమార్పిడీ కేంద్రాలుగా క్రైస్తవ మిషనరీ స్కూళ్లు

**జనగామ, మన చౌరాస్తా :**




మతమార్పిడీలను ప్రోత్సహిస్తూ, క్రైస్తవ ప్రార్థనలు చేయిస్తూ, చర్చీలకు రమ్మని విద్యార్థులను ప్రలోభపెడుతున్న విద్యాలయాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం జనగామ జిల్లా విద్యాశాఖాధికారి, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా నిర్వాహకులు డాక్టర్ మోహనకృష్ణ భార్గవ మాట్లాడుతూ జనగామలో పలు క్రైస్తవ మిషనరీ పాఠశాలల్లో ఉదయం ప్రార్థనలో జాతీయ గీతం, దేశభక్తి గేయాలతో పాటుగా క్రీస్తు స్తోత్రాలను చదివిస్తున్నారని, అనంతరం అమెన్ అని, ప్రెయిస్ థ లార్డ్, హల్లేలూయా వంటి పదాలు పలికిస్తున్నారని, అంతటితో ఆగకుండా పిల్లలు బైబిల్ చదవాలని, చర్చ్‌లకు వెళ్లాలని ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆరోపించారు. హిందూ చిన్నారులు బొట్టు పెట్టుకోకూడదని, దేవాలయాలకు వెల్లకూడదని బోధిస్తున్నారని అన్నారు. విద్యార్థుల్లో దేశ భక్తి, జాతీయత, సౌభాతృత్వం, సేవాతత్వం బోధించాల్సిన విద్యాలయాలు క్రైస్తవ మత మార్పిడీలకు కేంద్రాలుగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుప్రాయంలో మతకల్మషాలను నూరిపోయడం వల్ల సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావలసిన నవతరం మత మార్పిడీకి గురై, దేశద్రోహులుగా, సమాజ విచ్ఛిన్నకర శక్తులుగా మారే అవకాశం ఉంటుందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ పట్టణ అధ్యక్షుడు అంబటి బాలరాజు, కోశాధికారి కుందారపు బైరునాథ్, జిల్లా కార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, హిందు సంఘ నాయకులు ఉల్లెంగుల రాజు, నగర ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మధు, రమేష్, సంపత్, రణధీర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు..

## రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

**హనుమకొండ, మన చౌరాస్తా :** రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు, వరంగల్ జిల్లా కన్వీనర్ లు చక్రవర్తుల శ్రీనివాస్, గుండు రవి ల్యాద లింగమూర్తి, వేముల నరేష్, కక్కెర్ల దయాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాల్లో చదువుతున్న విద్యార్థులకే ఈ అవకాశం ఉందంటున్నారు. 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు చదివే విద్యార్థులు, రాష్ట్ర స్థాయి కమిటీ నిర్ణయించిన తెలంగాణ కవులైన 11మంది గురించి వ్యాసం రాయాలన్నారు. ఆ కవులు, 1)బమ్మెర పోతన , 2)దాశరధి కృష్ణమాచార్య , 3)సుద్దాల హనుమంతు, 4)వట్టి కోట ఆళ్వార్ స్వామి, 5)వానమామలై వరదాచార్యులు, 6)సురవరం ప్రతాపరెడ్డి, 7)సామల సదాశివ, 8)బోయ జంగయ్య, 9)పాకాల యశోద రెడ్డి, 10)కాళోజీ నారాయణరావు, 11)డాక్టర్ సి.నారాయణరెడ్డి కవులపై పాఠశాల స్థాయిలో పై కవుల గురించి వ్యాసరచన పోటీ పెట్టి ప్రతి పాఠశాల నుంచి ఒక అమ్మాయి ఒక అబ్బాయి రాసిన రెండు వ్యాసాలను జిల్లా స్థాయి పోటీలకు పంపించవలసి ఉంటుందని వారు తెలిపారు. అలా జిల్లా స్థాయిలో ప్రత్యక్ష పోటీకి ఎంపికై వచ్చిన 50 వ్యాసాల నుండి 5 గురుని వ ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపించనున్నట్లు చక్రవర్తుల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయిలోని, జిల్లా స్థాయిలోనూ గెలిచిన విద్యార్థులందరికీ లక్ష రూపాయలను బహుమతులుగా పంచనున్నట్లు నిర్వాహకులు నిర్ణయించినట్లు, వారు తెలిపారు. జిల్లా స్థాయికి ప్రతి పాఠశాల నుంచి రెండు వ్యాసాలు పంపించాలన్నారు. వీటికి చివరి తేదీ అక్టోబర్ ఆరుగా నిర్ణయించారు. పూర్తి వివరాలకు 8008791827, 9949796264 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



## కాలువ గండి పూడ్చేందుకు చర్యలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ శివారు లో ఇటీవలి వర్షాలకు దేవాదుల నార్త్ కెనాల్‌కు గండి పడగా, కాలువ ప్రవాహానికి అంతరాయం ఏర్పడింది. మంగళవారం ఎఇ అరవింద్ నేతృత్వంలో గండి పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. గండిని పూర్తిగా పూడ్చేందుకు చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. రాబోయే ఇరవై రోజుల్లో పనులను పూర్తి చేసి కాలువను యథావిధిగా ప్రవహించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఇందుకోసం కాలువ పరిధిలో ఒకరోజు డ్రైడే పాటించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, నాయకులు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పాము కాటుతో మహిళా మృతి

భీమదేవరపల్లి, మన చౌరాస్తా : పాము కాటుతో మహిళ మృతి చెందిన ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ముల్కనూర్ ఎస్సై రాజు తెలిపిన వివరాలు.. కమలాపూర్ మండలం దేశరాజుపల్లి గ్రామానికి చెందిన లావుడియా రమేశ్ కుటుంబంతో కలిసి కొత్తపల్లిలో నివసిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున 3 గంటలకు రమేష్ భార్య కమలను పాము కుట్టడంతో ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ చెప్పారు.

# సిద్ధిపేట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ రెడీ

- త్వరలో సీఎం చేతుల మీదుగా ప్రారంభం
- తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

**సిద్ధిపేట, మన చౌరాస్తా :** నంగనూరు మండలం నర్మెట్ట గ్రామంలో దాదాపు రూ.300 కోట్ల ఖర్చుతో నిర్మాణం అవుతున్న ఆయిల్ పామ్ తయారీ పరిశ్రమ ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మంగళవారం తెలంగాణ స్టేట్ ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి ఆయిల్ ఫెడ్ అధికారులతో కలిసి నిర్మాణం పూర్తి అయిన ఆయిల్ పాం ఫ్యాక్టరీ ఆవరణలో ఎఫ్ఎఫ్బీ ర్యాంపుని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవ రెడ్డి మాట్లాడుతూ ఫ్యాక్టరీ పనులు పూర్తి అయ్యాయని, ఆయిల్ పామ్ రైతులకు ఫ్యాక్టరీని అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి, మంత్రుల చేతులమీదుగా ప్రారంభించనున్నామని ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి పేర్కొన్నారు. చైర్మన్ వెంట ఆయిల్ ఫెడ్ అధికారులు, ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ఫ్యాక్టరీ ఇంజనీర్లు తదితరులు ఉన్నారు.





## రైతులను ఇబ్బంది పెట్టొద్దు

### మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్, మన చౌరాస్తా : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయలను మంగళవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ పరిశీలించారు. మరిపెడ మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం యూరియా పంపిణీ కేంద్రాన్ని సందర్శించి సరఫరా చేస్తున్న ప్రక్రియను పారదర్శకంగా ప్రతి ఒక రైతుకు అందే విధంగా ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, మరిపెడ మండలంలో గిరిపురంలో ఉన్న కేజీబీవీ వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్లోని డైనింగ్ హాల్, స్టోర్ గది, కిచెన్ షెడ్, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్ కుమార్, వ్యవసాయ శాఖ ఏడిఏ విజయ్ చందర్, స్థానిక తహసీల్దార్ కృష్ణవేణి తదితరులు ఉన్నారు. అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో, ప్రాథమిక సహకార వ్యవసాయ సొసైటీ నరసింహులపేట, పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నరసింహులపేటను సందర్శించారు.

## మెట్రోలో ట్రాన్స్‌జెండర్లకు ఉద్యోగాలు

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్ మెట్రోలో 20 మంది ట్రాన్స్‌జెండర్లను సెక్యూరిటీ గార్డులుగా నియమించింది తెలంగాణ ప్రభుత్వం. ఈ క్రమంలో మెట్రో రైల్ లిమిటెడ్ సెక్యూరిటీ వార్డులుగా నియామక పత్రాలు అందజేశారు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్. సెక్యూరిటీ గార్డు నియామకాల కోసం దాదాపు 300-400 మంది దరఖాస్తు చేసుకోగా, నైపుణ్యం కలిగిన వారిని ఎంపిక చేసింది ప్రభుత్వం. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మీడియాతో మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్ల అభ్యున్నతికి , వారు ఆత్మగౌరంతో జీవించాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారని..ఈ నేపథ్యంలోనే వీరిని నియమించారని పేర్కొన్నారు.

## విద్యార్థుల్లో అభ్యసన స్థాయి పెంచాలి

### హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్



**హనుమకొండ, మన చౌరాస్తా :** విద్యార్థుల అభ్యసన స్థాయి తక్కువగా ఉందని, అభ్యసన స్థాయిని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు. మంగళవారం కమలాపూర్ మండలం గూడూరులోని పీఎంశ్రీ తెలంగాణ మోడల్ స్కూల్ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. పాఠశాలలోని ఏడు, ఎనిమిది, పదో తరగతులను సందర్శించి విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని పరీక్షించారు. పదో తరగతి విద్యార్థులను గణిత సబ్జెక్టుకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో మెరుగ్గా ఉండేలా ఉపాధ్యాయులు తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగ్గా ఉండాలన్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి, ఎంఈఓ శ్రీధర్, తదితరులతోపాటు పాఠశాల ప్రిన్సిపల్ అనితా కుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## 17,18 తేదీల్లో ఏసీఎఫ్ మండల స్థాయి క్రీడలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 17, 18 తేదీల్లో హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని జడ్పి పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి ఎం.సునీత, మండల కార్యదర్శి ఎస్.శ్యాంసుందర్ తెలిపారు. అండర్14, అండర్17 బాల, బాలికలకు తేది 17న కబడ్డీ, 18 న ఖోఖో, వాలీబాల్ పోటీలు మండల స్థాయిలో ఎంపిక పోటీలుగా జరుగుతాయని వారు తెలిపారు. అండర్ 14 విభాగానికి జననం తేదీ జనవరి 2012 తర్వాత, అండర్17 విభాగానికి జననం తేదీ జనవరి 2009 తర్వాత ఉన్న వారు మాత్రమే ఈ ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 99494 60318 నంబర్లో సంప్రదించాలని శ్యామ్ సుందర్ సూచించారు.

# సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

**హనుమకొండ, మన చౌరాస్తా :** ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అమాయకులను మోసం చేయడంలో సైబర్ క్రైమ్ ప్రధానమైందని, దీనిని నివారించుటకు మనమందరం ముఖ్యంగా యువత అప్రమత్తంగా వ్యవహరించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. మంగళవారం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో సైబర్ క్రైమ్ పై నిర్వహించిన అవగాహన సదస్సు కార్యక్రమానికి సిపి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ప్రొఫెసర్ వీ రామచంద్రం, సైబర్ క్రైమ్ ఏసి పి కె గిరి కుమార్, వైస్ ప్రిన్సిపాల్ రెహ్మాన్ పాల్గొన్నారు. సిపి మాట్లాడుతూ సైబర్ నేరాలకు ఎవరు పాల్పడిన చట్ట ప్రకారం శిక్షించబడతారన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు లోను కాకూడదని ప్రొజెక్టర్ ద్వారా సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ సైబర్ క్రైమ్ చాలా ప్రమాదకరమైందని ముఖ్యంగా యువత దీనిపై అవగాహన కలిగి ఉండే విధంగా ఈ సదస్సును ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెహమాన్, వరంగల్ ట్రాఫిక్ ఏసిపి సత్యనారాయణ, నార్కోటెక్ ఇన్స్పెక్టర్ సతీష్, కళాశాల అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## భూనిర్వాసితుల నుంచి అభిప్రాయ సేకరణ

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** భీమదేవరపల్లి మండలం కేంద్రంలో మంగళవారం నాడు ముత్తారం ,మల్లారం గ్రామ రైతుల నుండి గౌరవెల్లి ప్రాజెక్ట్ భూసేకరణకై అభిప్రాయ సేకరణలో భాగంగా రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భముగా ఆర్డీవో రమేష్ రాథోడ్ హాజరై మాట్లాడుతూ లోయర్,మైనర్ కాలువల నిర్మాణాల్లో రెండు గ్రామాల్లో సుమారు అరవై ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులు ఎంత మేరకు నష్టపరిహారం కోరుకుంటున్నారో తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డిఇ చైతన్య,తహశీల్దార్ రాజేష్,ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.









# రైతు సమస్యల పరిష్కారానికి కృషి

**జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



**జనగామ, మన చౌరాస్తా :** రైతు సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం కృషి చేస్తానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలో విజయ డైరి సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశానికి విజయ డైరి చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "అసెంబ్లీలో మాట్లాడే మొదటి అవకాశం వచ్చినప్పుడు నేను జనగామ పాల రైతుల కోసం మాత్రమే మాట్లాడాను" అని గుర్తుచేశారు. గత పది సంవత్సరాలుగా నీటి కొరత సమస్యలేమీ లేవని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలోనే రైతులకు నీటి కొరత సమస్య ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, పాల ఉత్పత్తిదారుల సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ ముందు ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



# జనగామలో ఘనంగా శ్రీ జయంతి



**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని బాణాపురం శ్రీ వెంకటేశ్వర దేవాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. వైష్ణవ సాంప్రదాయం ప్రకారం సూర్యుడు సింహరాశిలో ఉన్నపుడు ఆచరించే ఈ వేడుకను శ్రీ జయంతిగా కూడా పిలుస్తారని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రధాన అర్చకుడు సిద్ధాంతి తిరుమల నల్లాన్ చక్రవర్తుల సంపత్కుమార కృష్ణమాచార్య తెలిపారు. సిద్ధాంతి నేతృత్వంలో ఉదయం స్వామి వారికి 108 లీటర్ల పాలాభిషేకం తో ప్రారంభించి, 25 కిలోల వెన్నతో అలంకరణ చేసి, పుష్పాభిషేకాలతో వేద పండితులు అనంతాచార్య, గోవిందాచార్య, రాఘవాచార్య, ఇంగరాచార్యులు, జగన్నాథాచార్యులు, సింగరాచార్యులు, శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి 21 రకాల ప్రసాదాల నివేదన చేసి పూజానంతరం భక్తులకు వితరణ చేశారు. కన్నుల పండుగ లా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు ప్రత్యేకించి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తరించారు.



# సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన వరంగల్ ఎంపీ కావ్య

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాదులో సీఎం రేవంత్ రెడ్డిని మంగళవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే స్టేషన్ ఎదుట నూతన మల్టీ మోడల్ ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఎంపీ డాక్టర్ కడియం కావ్య సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. భూపాలపల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు, భూపాలపల్లిని హసన్‌పర్తి రోడ్ లేదా భూపాలపల్లి జిల్లాకు దగ్గరగా ఉన్న ఉప్పల్, కమలాపూర్ రైల్వే స్టేషన్‌లకు అనుసంధానించే కొత్త రైల్వే లైన్ నిర్మాణంతో ప్రజా ప్రయోజనంతో పాటు ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందన్నారు. ఇప్పటికే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మరోసారి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకురావాలని సీఎం ని కోరారు. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పలు అభివృద్ధి పనులపై సీఎం రేవంత్ రెడ్డి తో చర్చించారు.



# అమరుల స్ఫూర్తితో ఉద్యమిస్తాం..

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**మద్దూరు, మన చౌరాస్తా :** అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో బైరాన్ పల్లి బురుజు వద్ద బైరాన్ పల్లి అమరవీరుల సంస్మరణ సభ సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన జాన్ వెస్లీ మాట్లాడుతూ తెలంగాణలో జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నైజాం పాలనకు వ్యతిరేకంగా రజాకార్లు, భూస్వాములు, దేశముఖుల కు వ్యతిరేకంగా ప్రజలకు అండగా ప్రాణాలను త్యాగం చేసి కమ్యూనిస్టులు పోరాడారని వెట్టి చాకిరిని మట్టుపెట్టారని ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్రం కల్పించారని, అన్ని వర్గాల ప్రజలను ఐక్యం చేసి కుల మతాలకు అతీతంగా నడిపిన గొప్ప వర్గ పోరాటం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం అన్నారు. బైరాన్ పల్లి చరిత్ర విరోచితమైన పోరాటాల చరిత్రని ఒకేరోజు 96 మందిని బురుజు వద్ద, కూటిగల్ గ్రామంలో 22 మందిని ఒకే రోజు రజాకార్లు గ్రామాల మీద దాడి చేసి కాల్చి చంపారని ఊచకోత కోశారని అయినా ప్రాణాలకు విరవకుండా ప్రజలకు అండగా నిలబడి ఎర్రజెండా పట్టుకుని పోరాటం చేశారని అన్నారు. ఈ ప్రాంతంలోని ప్రతి గ్రామంలో ప్రాణాలర్పించిన త్యాగాల చరిత్ర ఉందన్నారు. ఈ పోరాటం కుల మతాలకు అతీతంగా ప్రజలందరినీ ఐక్యం చేసిందని కానీ బిజెపి ఆర్ఎస్ఎస్ ఈ పోరాటాన్ని వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందాలని దొంగ నాటకాలు ఆడుతున్నారని ఇలాంటి వారికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చుక్క రాములు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఉడుత రవీందర్, సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాముని గోపాలస్వామి, రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, గొడ్డుబర్ల భాస్కర్, జిల్లా కమిటీ సభ్యులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, బండ కింది అరుణ్ కుమార్, తాడూరి రవీందర్, బద్దిపడగ కృష్ణారెడ్డి, చొప్పరి రవికుమార్, అత్తిని శారద, జాలిగపూ శిరీష, అమ్ముల బాల నరసయ్య, దాసరి ప్రశాంత్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, మద్దూరు మండల కార్యదర్శి ఎండి షఫీ, దూల్మిట్ట మండల కార్యదర్శి పోతిరెడ్డి రాజు, బైరాన్ పల్లి గ్రామ నాయకులు భూషణ పోయిన రాజు, సంపత్, కుమారస్వామి నాయకులు కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.